Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 146 | సోమవారం 3 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50



# జగజ్జేత భారత్

- ప్రపంచకప్ మన అమ్మాయిల సొంతం
- ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 52 పరుగులతో గెలుపు
- షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో
- ఐసీసీ 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్

- మిగతా 7లో..



### కార్పొరేట్ల చేతుల్లో

## రిమోట్‌గా మోడీ

### బీహార్‌లోని బెగుసరాయ్ ఎన్నికల ప్రచారంలో ప్రధానిపై రాహుల్ విమర్శలు

**బెగుసరాయ్-సూర్య వాస్తవం:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రధాని మోడీ భయపడటమే కాదు బడా వ్యాపారవేత్తల చేతిలో రిమోట్ కంట్రోల్‌గా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్‌లోని బెగుసరాయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ జీఎస్టీ అమలు, పెద్దనోట్ల రద్దు వంటి మోడీ సర్కార్ నిర్ణయాలు చిన్న వ్యాపారులను దెబ్బతీసి బడా పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చాయని వివరించారు. తాము అధికారంలోకి వస్తే చిన్న వ్యాపారాలను బలోపేతం చేస్తామని, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమాజంలోని అన్నివర్గాలకు ఉపయోగకరంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. నిరుద్యోగం వంటి సమస్యలను ఎత్తి చూపకుండా రీల్స్ చూస్తూ ఉండేలా ప్రధాని మోడీ యువతను

- మిగతా 2లో..

### లండన్ చేరుకున్న

## చంద్రబాబు దంపతులు

### - నేడు పలు సంస్థల ప్రతినిధులతో భేటీ



**అమరావతి-సూర్య వాస్తవం:** సిఎం చంద్రబాబు దంపతులు ఆదివారం రాత్రి లండన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో తెలుగు కుటుంబాలు వారికి స్వాగతం పలికాయి. ఈ నెల 4న ఎన్‌టిఆర్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎమ్‌డి నారా భువనేశ్వరికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ రెండు అవార్డులు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### నకిలీ మద్యం కేసులో

## జోగి రమేష్ అరెస్టు

### ఎక్సైజ్ కోర్టులో హాజరు



**ఇబ్రహీంపట్నం -సూర్య వాస్తవం:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కల్తీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు దూకుడు పెంచారు. జోగి రమేష్‌ను ఆదివారం అరెస్టు చేసి విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకూ జోగి రమేష్‌తోపాటు ఆయన సోదరుడు రాము, అనుచరుడు ఆరేపల్లి రామునహా మొత్తంగా 20 మందిని అరెస్టు చేసినట్లయింది. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ నివాసానికి చేరుకున్న ఎక్సైజ్, పోలీస్, క్లూస్ టీములతో కూడిన సిట్ బృందం విస్తృత తనిఖీలు చేసింది. జోగి రమేశ్, ఆయన భార్య ఫోన్లను సిట్ అధికారులు సీజ్ చేశారు. ఆయన నివాసంలోని సిసి ఫుటేజీలను, పలు హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తమ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూడున్నర గంటలపాటు హైడ్రామా సాగింది. పోలీసులు జోగి రమేష్‌ను అరెస్టు చేసి విజయవాడలోని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. రమేష్‌ను, రామును విడివిడిగా విచారించారు. జనార్ధనరావుతో ఆర్థిక సంబంధాలపై ప్రశ్నించినట్టు సమాచారం. రమేష్‌ను సుమారు ఏడు గంటల పాటు విచారించారు. ఈ కేసులో ఎ-18గా జోగి రమేష్‌ను, ఎ-19గా జోగి సోదరుడు రామును

- మిగతా 2లో..

### సీఎంఎస్-03

## ప్రయోగం సక్సెస్

### నిర్ణీత కక్ష్యలోకి దూసుకెళ్లిన భారీ ఉపగ్రహం



**శ్రీహరికోట-సూర్య వాస్తవం:** : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించిన 'సీఎంఎస్-03' ప్రయోగం విజయవంతమైంది. 'ఎల్‌వీఎం3-ఎం5' వాహక నౌక ద్వారా ఈ సమాచార ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రవేశపెట్టినట్టు ఇస్రో చైర్మెన్ నారాయణన్ తెలిపారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 నిమిషాలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ఉపగ్రహం బరువు 4,410 కిలోలు. భారత భూభాగం నుంచి స్వదేశీ రాకెట్ ద్వారా ఈ కక్ష్యలోకి ప్రయోగించిన శాటిలైట్లన్నింటిలోకీ ఇదే అత్యంత బరువైనది. "సీఎంఎస్-03 ప్రయోగం విజయవంతంకావడం ఆనందంగా ఉంది. ఇందులో కీలకపాత్ర పోషించిన అందరికీ అభినందనలు. ఈ ప్రయోగం తో భారత్ మరో ఘనత సాధించింది. శాస్త్రవేత్తలు, సిబ్బంది కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది. ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది" అని ఇస్రో చైర్మెన్ చెప్పారు.

**సముద్ర వాతావరణ పరిస్థితులపై కన్ను**

సీఎంఎస్-03 ఉపగ్రహం ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడటంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు కలగనుంది. ప్రధానంగా భారత నౌకాదళం కోసం దీన్ని రూపొందించారు. సాగర జలాల్లో మోహ రించిన మన యుద్ధనౌకలు, జలాంతర్గాములు, భూ నియంత్రణ కేంద్రాలతో భద్రమైన కమ్యూనికేషన్లు సాగించేందుకు ఈ శాటిలైట్ తోడ్పాటు అందిస్తుంది. భారత తీరం నుంచి 2వేల కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన సాగరజలాల్లో సేవలు అందించగలదు. దీన్ని జీశాట్-7ఆర్ అని కూడా పిలుస్తారు. 2013 నుంచి సేవలు అందిస్తున్న జీశాట్-7 స్థానంలో దీన్ని ప్రయోగించారు.

## లండన్ చేరుకున్న చంద్రబాబు దంపతులు

(మొదటిపేజీ తరువాయి)
అందించనుంది. డిస్టింగ్విష్డ్ ఫెలోషిష్2025 అవార్డు అందించనుంది. అలాగే హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకు డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డునూ అందుకోనున్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు సోమవారం పలువురు పారిశ్రామికవేత్తలతో సిఎం భేటీ కానున్నారు. ఆక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫ్రిట్జ్ గెరాల్డ్, హిందూజాకు చెందిన వివిధ సంస్థల ఛైర్మన్లు అశోక్ హిందూజా, షోమ్ హిందూజాలతో సిఎం భేటీ కానున్నారు. ఇక రోల్స్ రాయిస్ గ్రూప్ చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసరు నిక్కీ-గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ మ్రామ్ సంస్థ ఛైర్మన్ శైలేష్ హీరానందాని, శ్యామ్ కో-హోల్డింగ్స్ ఛైర్మన్ సంపత్‌కుమార్‌తో వరుస సమావేశాల్లో పాల్గొనున్నారు. లండన్‌లోని ఇండియన్ హైకమిషనరు దొరైస్వామితో సిఎం భేటీ కానున్నారు.

## కార్పొరేట్ల చేతుల్లో రిమోట్‌గా మోడీ


(మొదటిపేజీ తరువాయి)
ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు."ప్రధాని మోడీ తనది 56 ఇంచుల ఛాతి అని చెప్పుకుంటారు. ఆపరేషన్ సిందూర్ జరుగుతున్న సమయంలో డోనాల్డ్ ట్రంప్ మోడీకి ఫోన్ చేశారు. మోడీ గాబరాపడ్డారు, భయపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ట్రంప్ చెప్పారు. రెండు రోజుల్లోనే మోడీ ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశారు. నేను ఇది ఎందుకు చెబుతున్నానంటే ఇదే నిజం. అమెరికా అధ్యక్షుడు ఒక్కరికి మాత్రమే మోడీ భయపడరు. మోడీ రిమోట్ కంట్రోల్ అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తల చేతుల్లో ఉంది." అని రాహుల్ అన్నారు.

## నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టు

మొదటిపేజీ తరువాయి)
అధికారులు చేర్చనున్నారు. వారిద్దరినీ ఆదివారం రాత్రి వైద్య పరీక్షల కోసం విజయవాడలోని జిజిహెచ్‌కు తరలించారు. అక్కడికి తీసుకొస్తారనే సమాచారంతో జోగి రమేష్ అనుచరులు, వైసిపి కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో, పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం, తోపులాట జరగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వైద్యపరీక్షల అనంతరం జోగి రమేష్‌ను, రామును పోలీసులు ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చారు.

## చెరువులోకి దిగి.. రాహుల్ చేపల వేట

### - బీహార్ ఎన్నికల ప్రచారంలో రిలీఫ్



**పాట్నా -సూర్య వాస్తవం:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలోనే బెగుసరారు జిల్లాలో ఆయన మత్స్యకారులతో కలిసి చేపల వేట నిర్వహించారు. దీనికి సంబంధించిన దృశ్యాలను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సీఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీతో కలిసి రాహుల్ గాంధీ బోటు సాయంతో ఓ చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలోనే చేపలు పట్టేందుకుగానూ ముకేశ్ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈత కొట్టారు.ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ జాలర్లతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నట్టు కాంగ్రెస్ తెలిపింది. వేట నిషేధిత కాలంలో మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం, బీమా సదుపాయం, చేపల మార్కెట్‌ల ఏర్పాటు, మత్స్య సంపద కోసం జలవనరుల పునరుద్ధరణ వంటి హామీలు ఇచ్చినట్టు వెల్లడించింది.

# ఫినాలేలో విజేతగా బృంద

## ఇండియన్ ఐడల్ సీజన్ 4కు స్పెషల్ గెస్ట్ గా రవితేజ

## తెలుగులో అతి పెద్ద సింగింగ్ షో ఆహా




ఓటీటీ తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 4 సక్సెస్ ఫుల్ గ్రాండ్ ఫినాలే జరుపుకుంది. ఈ గ్రాండ్ ఫినాలేకు మాస్ మహారాజ రవితేజ స్పెషల్ గెస్ట్ గా హాజరవడం విశేషం. ఎనర్జీ, ఎమోషన్, ఎంటర్ టైన్ మెంట్ తో సాగిన ఈ గ్రాండ్ ఫినాలేలో బృంద విజేతగా నిలిచింది. పవన్ కల్యాణ్ రన్నరప్ గా నిలిచారు. జడ్జిలుగా వ్యవహరిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ తమన్, గాయకులు కార్తీక్ మరియు గీతా మాధురి తెలుగు ఇండియన్ ఐడల్' షో సీజన్ 4 గ్రాండ్ ఫినాలే విన్నర్ ట్రోఫీని బృందాకు అందజేశారు. తెలుగు ఇండియన్ ఐడల్' షో సీజన్ 4 గ్రాండ్ ఫినాలే విన్నర్ గా నిలిచిన బృంద తన నెక్ట్ మూవీలో పాట పాడుతుందని ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అనౌన్స్ చేశారు. సింగర్ గా బృంద కెరీర్ ఆరంభంలోనే ఇదొక బిగ్ స్టెప్ కానుంది. తెలుగు మ్యూజిక్ టాలెంట్ కు గుర్తింపు తీసుకురావడంలో తెలుగు ఇండియన్ ఐడల్' షో గొప్ప కృషి చేస్తోంది. గత నాలుగు సీజన్స్ గా ఎంతోమంది యంగ్ అండ్ టాలెంటెడ్ సింగర్స్ ను ప్రపంచానికి పరిచయం చేసిందీ షో.

# ఈపీఈపీతో కేరళ సక్సెస్

- తీవ్ర పేదరిక నిర్మూలనకు స్పష్టమైన ప్రణాళికతో ముందుకు
- నాలుగు లక్షల మంది సర్వేయర్లతో కుటుంబాల గుర్తింపు
- ప్రమాణాలుగా ఆహారం, ఆరోగ్యం, ఆదాయం, నివాసం
- ప్రతీ కుటుంబ పరిస్థితిని బట్టి మైక్రో ప్లాన్
- ఆర్థిక సహాయం, ఇండ్లు, వైద్య సేవలు, వసతుల కల్పన



**తిరువనంతపురం -సూర్య వాస్తవం:** భారత్ ఎదుర్కొంటున్న అత్యంత కఠినమైన సవాళ్లలో పేదరికం ఒకటి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు కేంద్రంలోని ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ.. దేశంలో మాత్రం పేదరికం సమస్య తీరటం లేదు. కానీ కేరళ మాత్రం దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. అత్యంత పేదరికాన్ని నిర్మూలించిన రాష్ట్రంగా నిలిచింది. ఈ మేరకు కేరళ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ఈనెల1న శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ ప్రకటించారు. దీంతో దేశ చరిత్రలో కేరళ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని నిలుపుకున్నది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది.

రాష్ట్రంలో అత్యంత పేదరికాన్ని పారదోలటానికి ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లింది. తీవ్ర పేదరిక నిర్మూలన కార్యక్రమం(ఎక్స్‌ట్రీమ్ పావర్టీ ఎరాడికేషన్ ప్రోగ్రామ్-ఈపీఈపీ) ద్వారా అత్యంత పేద కుటుంబాలను పేదరికం అనే మహమ్మారి నుంచి దూరం చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు లక్షల మంది ఎన్యుమరేటర్లు (సర్వేయర్లు) రాష్ట్రంలోని ప్రతి గ్రామం, వార్డుకు వెళ్లి అత్యంత పేద కుటుంబాలను గుర్తించారు. గుర్తింపునకు ఆహారం, ఆరోగ్యం, ఆదాయం, నివాసం అనే నాలుగు ప్రమాణాలను ఉపయోగించారు. ఇవి ఐక్యరాజ్య సమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీలు)కు అనుగుణంగా ఉన్నాయి. ఈ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 64,006 కుటుంబాల (1,03,099 మంది వ్యక్తులు) ను అత్యంత పేదలుగా గుర్తించారు. 2021లో నిటి ఆయోగ్ అధ్యయనం ప్రకారం కేరళ పేదరిక రేటు 0.7 శాతంగా దేశంలోనే కనిష్టంగా గుర్తించబడింది. 1970లో ఉన్న 59.8 శాతం పేదరికాన్ని క్రమంగా తగ్గించడంలో ప్రభుత్వ సంక్షేమ విధానాలు ప్రధాన పాత్ర వహించాయి.

### మైక్రోప్లాన్ ఇలా..

సాధారణంగా ప్రభుత్వ పథకాలు రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా అమలవుతాయి. కానీ ఈపీఈపీలో భాగంగా ప్రతి కుటుంబానికి వారి పరిస్థితిని బట్టి ప్రత్యేకమైన 'మైక్రో ప్లాన్ (వ్యక్తిగత ప్రణాళిక)'ను రూపొందించారు. కొందరికి ఇండ్లు కట్టించారు, కొందరికి వ్యాపారం మొదలు పెట్టేందుకు రూ.50వేలు వంటి ఆర్థిక సహాయం ఇచ్చారు. కొందరికి వైద్య సహాయం, మందులు, పల్లియేటివ్ కేర్ (పాలనా వైద్యం) అందించారు. కొన్ని సందర్భాల్లో అధికారులు డిటెక్టివ్‌లా పని చేసి వ్యక్తులను వెతికి కుటుంబాలను తిరిగి కలిపి, వారికి ఇండ్లు నిర్మించారు.

### పలు కుటుంబాలకు తోడ్పాటు

ఉదాహరణకు.. తిరువనంతపురంలోని చెల్లమంగళం వార్డులో గల అంబికా దేవి (57) అనే మహిళకు ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇంటి ముందు చిన్న కిరాణా దుకాణం పెట్టుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.50వేలు సహాయం చేసింది. ఇప్పుడు ఆ మహిళ ఆ కిరాణా దుకాణాన్ని నడుపుకుంటు జీవనం సాగిస్తున్నది. " నా భర్త ఏడేండ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆ తర్వాత పాడైపోయిన మా ఇంట్లో నివసించాను. కానీ అందులో ఒక భాగం కూలిపోయింది. దీంతో నా చెల్లెలి ఇంట్లో రెండేండ్లు ఉన్నాను. గత సెప్టెంబర్‌లో నాకు ఈ ఇల్లు ఈపీఈపీ ద్వారా లభించింది" అని అంబికా చెప్పింది. "డిసెంబర్‌లో నాకు రూ.50వేల సహాయం అందింది. నేను ఎక్కువగా నడవలేకపోవడంతో కార్పొరేషన్ అధికారులు కిరాణా షాపు మొదలు పెట్టాలని సూచించారు. ఇప్పుడు పొరుగున ఉన్నవారు కూడా ఇక్కడి నుంచే సరుకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నా జీవనానికి సరిపడా ఆదాయం వస్తోంది" అని ఆమె తెలిపింది.

ఇడుక్కి జిల్లా మంకుళం పంచాయతీకి చెందిన దాస్‌రాజ్ (67) భార్య, కుమారుల మానసిక ఆరోగ్యం సరిగ్గా లేదు. దానికి తోడు ఆయనకు జీవనోపాధి కూడా కావాల్సి ఉంది. అయితే ఈపీఈపీ కార్యక్రమం ఆయనకు ఎంతగానో దోహదం చేసింది. "నేను కూడా హృదయ సమస్యలతో బాధపడుతున్నాను. ప్రాజెక్టు ద్వారా మాకు ఇల్లు, కుడుంబశ్రీ ద్వారా రూ.50వేలతో మూడు మేకలు కొనుగోలు చేయగలిగాము" అని ఆయన చెప్పారు.

ప్రతి కుటుంబానికీ తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించారు. స్థానిక స్వపరిపాలన విభాగం (ఎల్‌ఎస్‌జీడీ) గణాంకాల ప్రకారం 21,263 మందికి అవసరమైన పత్రాలు, 3,913 కుటుంబాలకు ఇండ్లు, 1338 కుటుంబాలకు భూమి, ఇల్లు, 5,651 ఇండ్ల మరమ్మతులు జరిగాయి. ఇక ఆహారం, ఔషధాలు, ప్యాలియేటివ్ కేర్ 5,777 మందికి , జీవనోపాధి 4,394 కుటుంబాలకు అందించారు.

ఇడుక్కి జిల్లాలోని కుమారమంగళం పంచాయతీకి చెందిన షాయి వర్గీస్, ఆయన భార్య సునీత ఇద్దరూ దృష్టి లోపంతో బాధపడుతున్నారు. వారు ఒక గుడిసెలో నివసిస్తున్నారు. లైఫ్ ప్రాజెక్ట్ కింద ఇల్లు ఇవ్వాలని నిర్ణయించినా.. భూమి విభజన సమస్యతో ఆలస్యమైంది. దీంతో 27 ఏండ్లుగా కనిపించకుండా పోయిన ఆయన సోదరుడిని వెతికి, తిరిగి రప్పించి భూమి విభజన చేశారు. తర్వాత షాయి కుటుంబానికి ఇల్లు, జీవనోపాధి కోసం మ్యూజిక్ బాక్స్, మైక్‌లు ఇచ్చినట్టు గ్రామ అధికారి లసీలా చెప్పారు. ఈ ప్రాజెక్టులో ప్రజల భాగస్వామ్యం కూడా ప్రాజెక్ట్ విజయానికి కారణమైంది.

ఈపీఈపీ ప్రాజెక్ట్ లక్ష్యం.. ఈ కుటుంబాలు తిరిగి పేదరికంలో పడకూడదు. కొల్లాం జిల్లా చవర పంచాయతీకి చెందిన రెమ్యా(28) అనే యువతికి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. ఆమె భర్త ప్రశాంత్ కోవిడ్‌తో మరణించాడు. ప్రభుత్వం ఆమెకు ఇల్లు, స్థానిక జనసేవన కేంద్రంలో ఉద్యోగం కల్పించింది. దీంతో ఇప్పుడు ఆమె తన పిల్లలతో పాటు అత్తమామలను పోషించగులుగుతున్నది.

"మా పంచాయతీలోని 16 కుటుంబాలను అధికారులు తరచుగా పర్యవేక్షించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారానే వారందరికీ అవసరమైన పత్రాలు, ఇండ్లు మొదలైనవి సాధ్యమయ్యాయి" అని కన్నూర్ జిల్లాలోని కుట్టియాట్టూర్ పంచాయతీ అధ్యక్షురాలు పి.పి. రేజీ తెలిపారు. కాగా రాష్ట్రంలో తీవ్ర పేదరికం నంచి బయటపడిన పంచాయతీగా కుట్టియాట్టూర్ నిలిచింది. ఈ ప్రాజెక్ట్ కేరళ బలమైన వికేంద్రీకరణ పాలన వల్లే సాధ్యమైంది.

## ఒక్కొక్కరుగా దూరమౌతున్న మంత్రులు

**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మంత్రుల మధ్య పొసగని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉన్న 15 మంది మంత్రుల్లో సగం మంతి రేవంత్ పట్ల అంటీ ముట్టనట్లుగా ఉంటున్నారని ప్రచారం జరుగుతోంది. కొంత మంది ఆయనపై నేరుగా విమర్శలు చేస్తున్నారు. మరికొంత మంది పరోక్షంగా రేవంత్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో చాలా మంది మంత్రులు రేవంత్ రెడ్డికి సన్నిహితులే. మరి ఇప్పుడెందుకు దూరం అయ్యారు అంటే..అందరి దగ్గర నుంచి ఒకటే సమాధానం వినిపిస్తుంది. అదే కోటరీ. రేవంత్ రెడ్డి చుట్టూ ఎప్పుడూ ఉండే కొంత మంది వ్యక్తుల వల్ల.. ఆయనకు మంత్రులు దూరమైపోతున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని రేవంత్ గుర్తించడం లేదని అంటున్నారు. కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు లతో పాటు తాజాగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ముఖ్యమంత్రిపై అసంతృప్తిగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది. సినీ కార్మికుల అభినందన సభకు కోమటిరడ్డిని ఆహ్వానించలేదు. సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్న తనకు సమాచారం లేకుండా రేవంత్ సన్మానం చేయించుకోవడం ఏమిటని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కొండా సురేఖ తన ఓఎస్డీ సుమంత్ విషయంలో.. తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఆమె కుమార్తే నేరుగా సీఎంపై చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఓ టెండర్ విషయంలో జూపల్లి కృష్ణారావు పంచాయతీ పెట్టుకున్నారు. వీరంతా చెప్పే మాట ఒక్కటే.. నేరుగా రేవంత్ కాకపోయినా.. ఆయన చుట్టూ వారి వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అయినా.. జూపల్లి కృష్ణారావు అయినా..కొండా సురేఖ అయినా అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. తమను అవమానిస్తున్నారని చెబుతోంది.. నేరుగా సీఎం రేవంత్ రెడ్డిపై కాదు. ఆయన చుట్టూ ఉన్న మనుషులపై. సీఎంగా ఉన్న వ్యక్తి చుట్టూ పనులు చేపట్టడానికి కొంత మంది ఉంటారు. వారు సీఎంవోను మించి ఎక్కువ పెత్తనం చెలాయిస్తే అసలు సమస్యలు ప్రారంభమవుతాయి. సీఎం రేవంత్ రెడ్డి చుట్టూ అలాంటి వారు కొందరు ఉన్నారని చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఇద్దరి నేతల పేర్లు ఎక్కుగా ప్రచారంలోకి వస్తున్నాయి. వారిలో ఒకరు వేం నరేందర్ రెడ్డి, మరొకరు రోహిన్ కుమార్ రెడ్డి. నరేందర్ రెడ్డికి సీఎం సలహాదారుగా అధికారిక పదవి ఉంది. రోహిన్ రెడ్డికి అలాంటి పదవి ఏమీ లేదు. కానీ అన్ని విషయాల్లోనూ వీరు జోక్యం చేసుకుంటున్నారని.. బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. కొండా సురేఖ కుమార్తె రోహిన్ రెడ్డి గురించి చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఆయనే సినీ పరిశ్రమ వ్యవహారాలను చూసుకుని కోమటిరెడ్డిని లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు.సీఎం రేవంత్ రెడ్డి వివిధ మంత్రిత్వశాఖలు చేయాల్సిన పనులను.. తన సన్నిహితులకు.. అదీకూడా అధికారం లేని వారికి చేయమని పురమాయించడం వల్లనే ఇన్ని సమస్యలు వస్తున్నాయని.. వారు రాజ్యంగేతరశక్తులుగా మరి చిక్కులు తెచ్చి పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. గతంలో మంత్రిగా ఉన్న పొంగులేటి..రేవంత్ రెడ్డి చుట్టూ ఎక్కువగా కనిపించేవారు. కానీ ఇప్పుడు ఆయనకు బదులుగా.. ఇతరులు కనిపిస్తున్నాయి. ఆ కోటరీతో వస్తున్న సమస్యల వల్ల సీఎం ఇమేజ్ దెబ్బతింటోందన్న అభిప్రాయం కూడా ఉంది. రాజకీయాల్లో ముఖ్య పదవుల్లో ఉండే వారి బలహీనత ఏమిటంటే.. తన చుట్టూ ఉన్న కోటరీపై బయట నుంచి చాలా విమర్శలు వస్తున్నా చర్యలు తీసుకోలేరు. ఎందుకంటే వారిని తన నుంచి దూరం చేయడానికి చేస్తున్నారేమో అని వారనుకుంటారు. అలాగని తన చుట్టూ ఉన్న వారు చేస్తున్న పనులు ఆయన దృష్టికి పూర్తిగా రావు. దాని వల్ల అసలు నష్టం జరిగిన తర్వాతనే తెలుసుకోగలుగుతారు. ఏపీలో సీఎం జగన్ అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారని.. ఒకప్పుడు కోటరీలో భాగంగా ఉండి.. తర్వాత కోటరీ కారణంగానే కనిపించకుండా పోయిన విజయసాయిరెడ్డి బాధపడ్డారు. ఇప్పుడు రేవంత్ కడా అదే అనుభవంతో జాగ్రత్తపడాలని ఎక్కువ మంది సలహాలిస్తున్నారు. మరి రేవంత్ కు ఈ అంశంపై స్పష్టత ఉందో లేదో మరి.

## మావోయిస్టుల దగ్గర
## 400 కోట్లు... 400 కేజీల బంగారం

**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ఆపరేషన్ కగార్ తర్వత మావోయిస్టులు వరుసగా లొంగిపోతుండటంతో.. వారి దగ్గరున్న కోట్ల నగదు, ఆస్తులు ఎక్కడున్నాయోనని ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కరోనా సమయంలో ఈ నగదును బంగారం రూపంలోకి మార్చి ఉంటారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దాదాపు 400 కేజీల బంగారం, రూ.400 కోట్ల నిధులు మావోల వద్ద ఉన్నాయని అంచనా. ఈ నిధుల గుట్టు రట్టు చేసే పనిలో ఈడీ, ఎన్ఐఏ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఆపరేషన్ కగార్ వల్ల ముఖ్య మావోయిస్టు నేతల నుంచి సాధారణ దళ సభ్యుల వరకు చాలా మంది లొంగి పోతున్నారు. ప్రస్తుతం దేశంలో మావోయిస్టుల సంఖ్య తగ్గుతున్న తరుణంలో అనేక ప్రశ్నలు, అనుమానాలు తెర మీదకు వస్తున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి ఇన్నాళ్లు మావోయిస్టులు సేకరించిన కోట్ల రూపాయల నగదు , ఆస్తులు ఎక్కడ.. ఎవరి ఆధీనంలో ఉన్నాయి.. డంపుల మాటేమిటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు మరో ఆసక్తికర వార్త తెగ ప్రచారం అవుతోంది. అది ఏంటంటే.. మావోయిస్టులు సేకరించిన వందల కోట్ల రూపాయల నగదును కరోనా సమయంలో బంగారం రూపంలోకి మార్చారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మావోల వద్ద దాదాపు 400 కేజీల బంగారం ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఇదంతా ఎక్కడ ఉంది.. ఎలా భద్రపరిచారు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.గతంలో మావోలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి భారీ స్థాయిలోపార్టీ ఫండ్ వసూలు చేశారు. ఆ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. అలానే మావోయిస్టు పార్టీకి నిధుల సేకరించేందుకు గాను పెద్ద స్థాయిలో నెట్ వర్క్ ఉందన్న విషయం జాతీయ విచారణ సంస్థ(ఎన్ఐఏ) దర్యాప్తులో వెలుగు చూసింది. ఇప్పుడు మావోయిస్టులకు నిధులు అందకుండా పూర్తి స్థాయిలో కట్టడి చేసినా సరే వారి వద్ద ఉన్న నిధులతో మరో ఐదారు సంవత్సరాలు పార్టీని నడపొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ అప్పటి వరకు మావోలు బతికి ఉండే అవకాశం లేక.. వరుసగా లొంగిపోతున్నారు.మావోయిస్టులు తమకు అందిన డబ్బును రెండు రకాలుగా మార్చినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ప్రధానంగా పార్టీ సానుభూతిపరులు,వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరటి బ్యాంక్ అకౌంట్స్ తెరిచి వాటిల్లో డిపాజిట్ చేయడంతో పాటు.. కొందరి పేరు మీద కంపెనీలు.. మరి కొన్ని సార్లు డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు జమ చేశారని తెలుస్తోంది. మిగిలిన నగదును బంగారం రూపంలోకి మార్చేశారని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం మావోయిస్టు పార్టీ దగ్గర.. దాదాపు రూ.400 కోట్ల నిధులు ఉంటాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలానే 400 కేజీల బంగారం నిల్వలు కూడా ఉండొచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఆ బంగారం అంతా అడవుల్లోని డంపుల్లో ఉందా.. లేదంటే బయట ఎక్కడైనా దాచారా అనే అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఈడీ అధికారులు పలు రాష్ట్రాల్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఖాతాలో భారీ ఎత్తున నగదు డిపాజిట్ చేసినట్లు గుర్తించారు. అలానే లొంగిపోతున్న మావోయిస్టుల తమ దగ్గర ఉన్న ఆయుధాల గురించే కాక నగదు గురించి కూడా లెక్కలు చెప్పాకే బయటకు వస్తున్నారని తెలుస్తోంది.

# అలా ముగిసిన కేబినెట్

## తెలంగాణలో ఆశావహులకు మళ్లీ మొండిచేయి..

**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** తెలంగాణ మంత్రివర్గాన్ని విస్తరించారు. అయితే ఒక్క అజహరుద్దీన్ కు మాత్రమే అవకాశం కల్పించారు. అవకాశం కోసం చూస్తున్న ఇతర నేతలకు నామినేటెడ్ పోస్టులు కేటాయించారు. తెలంగాణ కాంగ్రెస్ హైకమాండ్, రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ముందు మంత్రి పదవి కోసం ఆశలు పెట్టుకున్న సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డిని సలహాదారుగా పదవి ప్రకటించారు. హైకమాండ్ ఆదేశాల మేరకు సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా నియమించారు. ఆరు గ్యారంటీల అమలు విషయాలను ఆయన చూసుకుంటారు. ముఖ్యమంత్రి కార్యాలయం జీవో నంబర్ 142 జారీ చేసింది. సుదర్శన్ రెడ్డి ఆరు గ్యారంటీలు ? మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, యువ వికాసం, చేయూత వంటి పథకాల అమలులో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ గ్యారంటీల అమలు, దాదాపు 1.05 కోట్ల ప్రజా పాలన దరఖాస్తులపై ఆధారపడి ఉంది. సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పని చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుతో పాటు మంత్రి పదవి ఆశలు పెట్టుకున్నారు. మొదటి దశ విస్తరణలో అవకాశం రాలేదు. జూన్ క్యాబినెట్ విస్తరణలో బీసీ, ఎస్సీలకే అవకాశం కల్పించాలని అనుకోవడంతో ఆయన పేరు పరిగణనలోకి రాలేదు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి డి. శ్రీధర్ బాబు నేతృత్వంలో ఏర్పడిన ఆరు గ్యారంటీల సబ్-కమిటీలో సుదర్శన్ రెడ్డిని సలహాదారుగా నియమించడం ద్వారా హైకమాండ్ ఆయకు కేబినెట్ హోదా కల్పించినట్లయింది. ఈ పదవి ద్వారా మంత్రి స్థాయి సదుపాయాలు, డెసిషన్ మేకింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తుంది. ఇది తాత్కాలికంగానే త్వరలో మంత్రి పదవి ఖాయం అని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.



మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కూడా మంత్రి పదవి కోసం ఎదురు చూస్తున్నారు. పార్టీ హైకమాండ్ తనను మోసం చేయదని.. ఆయన అనుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో అందరూ పార్టీ మారిపోయినా తాను మాత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని కాపాడుకున్నానని చెబుతూ వస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాలతో ఆయనకు పదవులు ఇవ్వలేకపోయారు. ఈ కారణంగా ఆయనకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిద్దరూ మంత్రి పదవి రేసులో కీలకంగా ఉన్నారు. మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేసిన రోజే కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ కేబినెట్‌లో బెర్త్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న పలువురు కాంగ్రెస్ నేతలకు ఇతర పదవులను కట్టబెట్టంది. సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావుకు కేబినెట్ హోదా పదవులు కట్టబెట్టింది. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు బాధ్యతను సుదర్శన్ రెడ్డికి అప్పగించింది. ఈ క్రమంలో ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. ఇప్పటి నుంచి ఈ పథకాల అమలును సుదర్శన్ రెడ్డి సమీక్షించనున్నారు. కేబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆరు గ్యారంటీల అమలును ఆయన పర్యవేక్షించనున్నారు. ఇక సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్ రావును నియమించింది సర్కార్. గతంలో మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు నామినేటెడ్ పోస్ట్ కట్టబెట్టింది.రేవంత్ సర్కార్ నిర్ణయం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అజారుద్దీన్‌తో కలిపి తెలంగాణ మంత్రివర్గం సంఖ్య 16కు చేరుకుంది. కేబినెట్‌లో మరో ఇద్దరికి ఇంకా అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గంలో ఛాన్స్ ఆశిస్తున్న ఈ ఇద్దరు నేతలు రేవంత్ సర్కార్ ఆఫర్ చేసిన పదవులను స్వీకరిస్తారా ? లేదా ? అన్నది ఆసక్తికరంగా మారింది.వీరి సంగతి ఇలా ఉంటే.. కేబినెట్ బెర్త్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి విషయంలో కాంగ్రెస్ హైకమాండ్, సీఎం రేవంత్ ఆలోచన ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. తమకు కచ్చితంగా కేబినెట్ బెర్తులు కావాల్సిందే అని ఈ ఇద్దరు నేతలు అనేకసార్లు కుండబద్దలు కొట్టారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ విషయంలో ఎప్పటికప్పుడు తన మనోగతాన్ని బయటపెడుతూనే ఉన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి సైతం హైదరాబాద్, రంగారెడ్డి కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.ఇక మంత్రివర్గంలో బెర్త్ ఆశిస్తున్నారు కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి. తనకు మంత్రి రాకపోవడం వల్లే ఆమె యాక్టివ్‌గా ఉండటం లేదనే చర్చ కూడా జరుగుతోంది. మరోవైపు కీలకమైన మున్నూరు కాపు కోటా, యాదవ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య వంటి వాళ్లు కూడా మంత్రి పదవుల రేసులో ఉన్నారు. దీంతో మంత్రివర్గంలో బ్యాలెన్స్ ఉన్న ఆ రెండు పదవులు ఎవరికి దక్కుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రైవేట్ సేవల్లో డాక్టర్లు బిజీ బిజీ

**నిజామాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వఆస్పత్రి ఇబ్బందికి అత్యవసర చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలనే కల్పంతో ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణం చేసింది.నిత్యం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వేల సంఖ్యలో రోగులు జిల్లా నలుమూలల నుండే రా కాకుండా పరుగు రాష్ట్రాల నుండి కూడా పరుగు జిల్లాల నుండి కూడా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో నమ్మకంతో మెరుగైన వైద్యం కోసం రోగులు వస్తుండగా రోడ్డు ప్రమాదాలు వివిధ సంఘటనలో గాయపడిన వారూ నిత్యం వేల సంఖ్యలో వస్తూనే ఉన్నారు.వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పెద్ద పెద్ద డాక్టర్లు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉంటారని ఎంతో నమ్మకంతో వస్తే... ఆసుపత్రిలో మాత్రం పెద్ద డాక్టర్లు ఇలా వస్తున్నారు అలా వెళ్ళిపోతున్నారు అన్న ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ వంటి పెద్ద పెద్ద హోదాలో పెద్ద డాక్టర్లు అని చెప్పుకుంటూ తాటికాయ అంత అక్షరాలతో బోర్డులు పెట్టుకొని ప్రతి విభాగంలో తమ వంతు కేటాయించుకున్నారు.ఒక్కరోజు కూడా వారికి కేటాయించిన పెద్ద డాక్టర్ల తమ విభాగాలలో పూర్తి సమయం కేటాయించడం లేదు. పెద్ద డాక్టర్లకు ఆ కుర్చీ కూర్చుండేందుకు తీరిక లేకుండా అవుతోంది.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేస్తుంటే నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు మాత్రం పెద్ద డాక్టర్ల పనితీరు ఇష్ట రాజ్యాంగా మారింది.మేమే పెద్ద డాక్టర్లము మాకు ఎవరు అడుగుతారని.... ప్రశ్నిస్తారు... మేము చెప్పిందే వేదం... మేము పెన్ను పెట్టకుంటే వైద్యమే జరగదు.... రోగి బంధువులు చికిత్స చేయాలని ప్రశ్నించిన.... ఎదురించిన తిక్కతిక్క మాట్లాడితే అందరు డాక్టర్లు ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు విధులు బహిష్కరించి. పోలీసులకు కంప్లైంట్ చేసి నిరసన కార్యక్రమం చేపడతామని భయాందోళన గురి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం..



నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో వైద్యులకు తిరగబడితే నిజామాబాద్ జిల్లా నే కాకుండా హైదరాబాద్లోని ఏ ఆసుపత్రిలో కూడా మీకు వైద్యం జరగకుండా చూసే దమ్ము మాకు ఉందని రోగి బంధువులకు ఘాటుగా వైద్యులు సమాధానం చెప్పడంతో రోగులు రోజు బంధువులు ఎక్కడ మాకు వైద్యం అందకుండా ఈ వైద్యులు చేస్తామని కరుకొండ గా చెప్పడంతో ఏమి దిక్కుతోచక ఇక్కడ వైద్యులు చెప్పే విధంగానే సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రోగులు రోగి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నిజానికి గతంలో ఉన్న సూపర్డెంట్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోనీ అన్ని విభాగాలకు సంబంధించిన హెచ్వోడి... ఆర్ ఎం ఓ... తోపాటు ఫిజీషియన్, సర్జన్, పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, పలమాలజిస్ట్, సైకియాట్రిస్ట్, ఆర్థోపెడిక్ న్యూరాలజిస్ట్, రేడియాలజిస్ట్, పాతలోజిస్ట్ తో పాటు వివిధ విభాగాల సంబంధించిన వైద్యులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఈ విభాగాలకు సంబంధించిన రోగులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తే తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రత్యేకంగా సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.కానీ నూతనంగా ప్రభుత్వ జనరల్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏ ఒక్క పెద్ద పెద్ద డాక్టర్లైన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, తమ విభాలకు సంబంధించిన గదులకు హెచ్ ఓ డి లు అని తమ పేరుతో కూడుకున్న పలకలు బ్రహ్మాండంగా బిగిస్తున్నారు. ఏ ఒక్కరోజు కూడా ఆ గదులను తెరిచి కూర్చున్న దాఖలాలు లేవు.వారానికి ఒకసారి ఇలా రావడం రిజిష్టర్లు అన్ని సంతకాలు ఒకటే రోజు చేయడం అలా వెళ్ళిపోవడం జరుగుతుందని విశ్వసినీయ సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో శస్త్ర చికిత్సలు, మెరుగైన వైద్య సేవలు అందుతా యని ఆసుపత్రికి వస్తే మాత్రం రోగులకు రోగి బంధువులకు నిరాశే మిగులుతుంది.. ఇదే ఆస్పత్రిలో గతంలో ప్రైవేట్ ఆస్పత్రికి దీటుగా అన్ని రకాల శస్త్ర చికిత్సలు జరిగిన దాఖలాలు ఉంటే ప్రస్తుతం మాత్రం ఇక్కడ అలాంటి ఆపరేషన్లు జరగడంలేదని,,చికితకు సంబంధించిన ఆధునిక పరికరాలు అందుబాటులో లేవని, అంతేకాకుండా ప్రత్యేక నిపుణులైన వైద్యులు నియామకం చేయలేదని, రోగి బంధువులకు సమాధానం ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మీకు ఇలాంటి శస్త్ర చికిత్సలు జరుపుకోవాలని ఉంటే హైదరాబాద్లోని ఉస్మానియా హాస్పిటల్ గాంధీ హాస్పిటల్, లేదా నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లాలని సలహాలు సూచనలు ఇస్తున్నారు.మీ దగ్గర డబ్బులు ఉంటే మాత్రం ఎలాంటి ఆలస్యం చేయకుండా ప్రైవేట్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం అందాలంటే అది ఒకటే మార్గమని కరఖండుగా ప్రభుత్వ ఆసుపత్రులు వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి శస్త్రత చికిత్సలు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ ప్రత్యేక నిపుణులైన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అనుబంధం ఉన్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్నత వైద్య శిక్షణ పొందుతున్న ఎస్సార్లు, మెడికో వైద్య విద్యార్థులు మాత్రం వారికి తోచినంత వైద్య పరిజ్ఞానంతో వైద్య చికిత్సలు అందజేస్తున్నారు.ఎవరైనా ఆవేదనతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపర్డెంట్ గాని సంబంధిత అధికారులకు గాని ఫిర్యాదు చేయడానికి పోతే పట్టించుకునే నాధుడే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధం కలిగి ఉన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గాని, జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి తోపాటు ఎంపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యుల పనితీరుపై దృష్టి సారించి రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అదే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## నేడు చిత్తూరు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

**చిత్తూరు, సూర్య వాస్తవం, నవంబర్ 2:** జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉదయ 3.11.25 తేదీన ఉదయం 9 .30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని మండల,డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### అనంతపురం కలెక్టర్ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి**

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు.. అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఉసిరి మొక్కల పంపిణీ



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** అనంతపురంలోని శ్రీనివాస్ నగర్లో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తులకు ఉసిరి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాము తెలిపారు. దాత హనుమంతు ఆధ్వర్యంలో సోమవారం మొక్కలను భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 13 వార్డులో కోటి సంతకాల సేకరణ



**పామిడి, సూర్య వాస్తవం,నవంబర్ 2:** మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి,గుంతకల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వై.వెంకటరామిరెడ్డి అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి సూచనలు మేరకుకూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన" కోటి సంతకాల సేకరణ" కార్యక్రమాన్ని ఆదివారం పామిడి టౌన్ వైఎస్ఆర్సిపి ప్రెసిడెంట్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో 13వ వార్డ్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 13వ వార్డు ఇంచార్జ్ సింగరప్ప. కుమ్మెత లక్ష్మి మహేష్ రెడ్డి. బాలకృష్ణ.సాకల సుంకన్న మరియు వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బీసీలకు చట్టసభల్లో

# 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య





**కర్నూల్, సూర్య వాస్తవం, నవంబర్ 2 :** కర్నూలు నగరంలోని స్థానిక లేపాక్షి హెూటల్ నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎంపీ బస్తిపాటి నాగరాజు డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్, స్టేట్ డైరెక్టర్ రామకృష్ణ, నక్కల మిట్ట శ్రీనివాసులు, రాంబాబు, కుమ్మరి రామకృష్ణ, వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య,ఎంపీ బస్తిపాటి నాగరాజు, బీసీ నాయకులు మాట్లాడుతూ బిసి కుల సంఘాలు మరియు బీసీ సంఘాల నాయకులను కలుపుకొని జేఏసీ ఏర్పాటు చేసుకుని గౌరవ ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు ని కలిసి వారి ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని కలిసి బి సి సమస్యలను విన్నవించడానికి పెద్ద ఎత్తున కార్యచరణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని త్వరలో కలిసి బీసీల డిమాండ్ల సాధనకై ప్రధానమంత్రి నరేంద్ర మోడీని పార్లమెంట్ లో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ బిల్లు ప్రధాని మోడీ వల్లే సాధ్యం అవుతుందని అన్నారు. బిసిల డిమాండ్లు బీసీల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బీసీలకు చరిత్రలో నిలిచిపోయే విధంగా చారిత్రాత్మకంగా నిర్ణయాలు తీసుకుంటుంది. గత ప్రభుత్వాలు జనాభా గణనలో కులగణన చేపట్టాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదు. కానీ బిజెపి ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేయాలని చారిత్రాత్మకంమైన నిర్ణయం తీసుకుంది. ఇదొక చరిత్ర – ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోడీకే దక్కుతుంది. ఎన్నోసార్లు వందలాది పార్లమెంటు సభ్యులను, ప్రతిపక్ష పార్టీలను కలిసి విజ్ఞప్తి చేశాము. కేంద్ర ప్రభుత్వానికి 18 డిమాండ్లు సమర్పించగా 4 డిమాండ్లను పరిష్కరించింది. 1. జాతీయ బిసి కమిషన్ కు రాజ్యాంగబద్ధమైన హెూదా, 2. కేంద్ర ఓబిసి రిజర్వేషన్లను గ్రూపులుగా వర్గీకరించడానికి అంగీకరించారు. జనగణనలో కులగణన చేపట్టడానికి అంగీకరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వివిధ వృత్తుల వారికి 90కోట్ల సబ్సిడీ రుణాలు ఇవ్వడానికి చర్యలు తీసుకొంది. జీవోలు జారీ చేశారు. కులగణన తర్వాత బి.సి.లకు అన్ని రంగాలలో ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ, సామజిక, విద్యా, ఉద్యోగ రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుంది. అన్ని కోణాలలో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మక మైన మార్పు వస్తుందన్నారు. ఇది ప్రజస్వామ్యదేశం అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి, వారి జనాభా ప్రకారం వాటాఇవ్వాలి. అప్పుడు దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి ఉంటుంది. అందుకోసం బి.సి లకు రావలసిన వాటా కోసం మరోసారి ఉద్యమం జరగాలి. బి.సి లకు రాజ్యాంగబద్దమైన హక్కులు–వాటా కల్పించవలసిన సమయం ఆసన్నమైనది.

**బీసీ డిమాండ్స్**

. పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టి చట్ట సభలలో బి.సి లకు 50 శాతం రిజవేషన్లు కల్పించాలి. కేంద్రంలో బి.సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. బి.సి ల అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలి. ప్రత్యేకంగా కేంద్ర స్థాయి లో స్కాలర్ షిప్ లు, ఫీజుల రియంబర్స్మెంట్, ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి "బి.సియాక్టు"ను పార్లమెంట్ లో తీసుకరావాలి. రాష్ట్రంలో కేంద్రంలో విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బి.సి ల జనాభా ప్రకారం 27 శాతం నుండి 56 శాతం కుపెంచాలి. బీసీల తలసరి ఆదాయం 8 లక్షల ఉంది దానిని 15 లక్షలకు పెంచాలి.

## మోడల్ కాలనీలో యునాని వైద్యశాల ప్రారంభం



**కుప్పం, సూర్య వాస్తవం, నవంబర్ 2:** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీలో ఆదివారం యునాని ఇండియన్ క్లినిక్‌ను తెదేపా నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యునాని వైద్యశాల నిర్వహిస్తున్న డాక్టర్ హిజామా మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తింపు పొందిన యునాని వైద్యం కుప్పం ప్రజలకు చేరువకావడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో దశాబ్దాల చరిత్ర కలిగిన యునాని వైద్యానికి ప్రతి రోగాన్ని నయం చేసే గుణం ఉందన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ యునాని వైద్యం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుసుకొని వైద్య చికిత్సలు పొందాలని ఆకాంక్షించారు. కుప్పం ప్రజలకు యునాని వైద్యాన్ని పరిచయం చేస్తున్నందుకు డాక్టర్ హిజామాను తెదేపా నేతలు ప్రశంసించారు. కుప్పం నియోజకవర్గం లో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని సంక్షేమాన్ని కోరుకునే ముఖ్యమంత్రి తమకు ఉండడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మైనార్టీ అధ్యక్షులు జాకీర్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మధుమేహ వైద్య నిపుణురాలు హిజామా, స్థానిక టిడిపి నేతలు అబ్దుల్ గని, బాబు, నవాజ్ అల్లాబకష్ పాల్గొన్నారు.





## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

- **ఉసిరక వృక్షానికి, తులసి మాతకు పూజలు**

**పామిడి, సూర్య వాస్తవం, నవంబర్ 2:** పామిడి పట్టణంలోని మాడి వెంకట స్వామి తోటలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం వారు కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద సంవత్సరాల ఉసిరక వృక్షానికి, తులసి మాతకు పెద్దయత్తున పూజలు చేశారు. పురోహితుని ద్వారా సంకల్ప పూజలు చేశారు. కార్తీక మాసం ద్వాదశి సందర్భంగా ధాత్రి, దామోదర పూజలు చేశారు. చెట్టు క్రింద శివ అభిషేకం దీపారాధనలు చేశారు. ఉసిరిక చెట్టు పూజలు అత్యంత పుణ్య ప్రాధంగా హిందువులు భావిస్తారు. వివిధక్రీడా పోటీలు ఆర్య వైశ్య సంఘం సభ్యులకు చేపట్టారు. గెలిచిన వారికి బహుమతులు ఇచ్చారు. అనంతరం కొత్తురు రామ మోహన్ అనురాధ కుటుంబ సభ్యులు వనభోజనం అందించారు. నూతనంగా ఏర్పాటైన ఆర్య వైశ్య యువజన సంఘం వారు ఆర్య వైశ్య సంఘం పాలక మండలి వారిని సత్కరించారు.



# జిల్లాలో నాటుసారా నామరూపాలు లేకుండా చేస్తాం

**నవోదయం ద్వారా అవగాహన కల్పించాం**

**మద్యం అమ్మకాలలో సత్యసాయి జిల్లా మొదటి స్థానంలో ఉంది**


**శ్రీ సత్య సాయి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందు నాయక్**

**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 2:** శ్రీ సత్య సాయి జిల్లాలో నాటు సారా తయారీ కేంద్రంపై దాడులు చేసి నాటు సారా అనే మాట ఎక్కడ వినపడకుండా నామరూపాలు లేకుండా చేస్తామని శ్రీ సత్య సాయి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎస్ గోవిందు నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కదిరిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఎస్ గోవిందు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి నాటు సారా తాగితే దానివల్ల వచ్చే అనర్థాలను వివరించామని పేర్కొన్నారు. నాటు సారా తాగే అలవాటు ఉన్న వారు నాటు సారా వైపు వెళ్లకుండా నాణ్యమైన మద్యాన్ని సేవించాలని సూచించారు. అలాంటి వారి కోసం మద్యం దుకాణాలలో కూడా కేవలం 99 రూపాయలకే మద్యాన్ని అందుబాటులో



ఉంచామని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాలోకి కర్ణాటక మద్యం కూడా రవాణా జరగడంలేదని పేర్కొన్నారు. అందువల్ల సత్యసాయి జిల్లాలో కూడా మద్యం అమ్మకాలు పెరిగాయని అన్నారు. మద్యం అమ్మకాల లో శ్రీ సత్య సాయి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో 20 నుంచి 50 శాతం మద్యం అమ్మకాలు పెరిగాయని వివరించారు ప్రత్యేకించి గిరిజన తండాలలో కొందరు సుఖ దుఃఖాలలో నాటు సారాను వాడుకోవడం ఆనవాయితీగా ఉందని అలాంటి మూఢనమ్మకాలు, మూఢాచారాలను నమ్మకుండా వాటి నుంచి తప్పుకోవాలని సూచించారు. నాటు సారా తయారు చేస్తున్నారని సమాచారం వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లను కూడా గోప్యంగా ఉంచుతామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కదిరి పట్టణానికి గతంలో అక్రమంగా రవాణా చేసిన కర్ణాటక మధ్యాన్ని పట్టణ పోలీస్ స్టేషన్లో ధ్వంసం చేశామని చెప్పారు. ఈఎస్ తో పాటు స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు శ్రీధర్, దత్తాత్రేయ, శ్రీధర్ బాబు, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ సిబ్బంది ఉన్నారు.

# మేనకూరులో కోటి సంతకాల సేకరణ



**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాయుడుపేట మండలంలోని మేనకూరు పంచాయతీలోని వద్దిగుంట కండ్రిగ గ్రామంలో వైసీపీ నేత,విజయ డైరీ డైరెక్టర్ కట్టా భవాని శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో నిర్వహించారు.తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ఆదివారం ఆయన స్థానిక వైసీపీ నాయకులతో కలిసి వద్దిగుంటకండ్రిగ గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,విజయ డైరీ డైరెక్టర్ కట్టా భవాని శంకర్ రెడ్డి,నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి,నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, నియోజకవర్గ వైసీపీ మహిళా అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ,వైసీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

**రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్**



**కుప్పం, సూర్య వాస్తవం, నవంబర్ 2:** కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం కుప్పం నియోజకవర్గంలోని కుప్పం గుడిపల్లి మండలాల్లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వేపూరు మిట్టపల్లి, గుండ్ల సాగరం, కనమనపల్లి, యామగానిపల్లి గ్రామాలలో జనసేన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి నాయకులను సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరిగెడుతుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ మెజారిటీ రావాలంటే కూటమి పార్టీలు బలపడాలని మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుప్పం జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు కాణిపాకం దేవస్థానం పాలకవర్గ సభ్యులు డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సూపర్ 6 కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. ఇదే సందర్భంలో జనసేన పార్టీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న తీరును, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు బలంగా తెలియజేయాలని కోరారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు వేపూరి మిట్టపల్లి రాఘవ, గుండ్ల సాగరం అమీర్, యామగాని పల్లి మణికంత, కనమనపల్లి నాగరాజు, ఆ పార్టీ మహిళ జనసైనికులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# పనిచేయని సింగరేణి అంబులెన్స్‌లు

**ఆదిలాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** పుడమి తల్లి ఒడిలో పని చేస్తూ నల్లబంగారాన్ని వెలికి తీసే కార్మికుల ఆరోగ్యంపై స్థానిక సింగరేణి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో అంబులెన్స్ నిర్వహణలో అత్యంత నిర్లక్ష్యం వహిస్తూ, కార్మికుల ఆరోగ్యలపై అలసత్వం వహిస్తున్నారు. లక్షలలో టెండర్ ద్వారా పొందిన మార్చురీ అంబులెన్స్ కాంట్రాక్టర్ కార్మికులకు సేవలనుఅందించడంలో విఫలం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహన ఫిట్నెస్ సమయంలో విటిసి ఓ పామ్ దరఖాస్తు లో తెలిపిన డ్రైవర్లతో కాకుండా అ నుభవం లేని డ్రైవర్లతో వాహనాన్ని నడిపిస్తున్నారనే చర్చ సాగుతుంది. నిబంధనల మేరకు ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సిన చోట ఇద్దరి తోనే విధులను నిర్వహిస్తు మమ అని పిస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంబులెన్స్ వాహనాలను ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్చి టెండర్లు పిలిచి నూతన వాహనాలను ఏర్పాటు చేస్తారు. కానీ మార్చురీ అంబులెన్స్ టెండర్ మే నెలలో వర్క్ ఆర్డర్ ఇవ్వగా నాటి నుండి నేటి వరకు సంస్థ నిబంధనలను పట్టించుకోకుం డానే ఓ అధికారి అండదండలతో నెలవారి బిల్లులను డ్రా చేస్తున్నట్లు తెలుస్తుంది.

# అదీ సజ్జనార్ సార్ అంతే

**ఎస్ఐను అడ్డంగా బుక్ చేసిన పోలీస్ బాస్**



**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** చేనుకు రక్షణగా కంచె ఉండాలి. కానీ కంచె చేనును వేయకూడదు. అలాంటి పని ఈ ఎస్ఐ చేశాడు. సమాజానికి కంటగింపుగా మారిన వ్యక్తిని కాపాడాడు. మోసాలు చేసి వేల కోట్లు సంపాదించిన వ్యక్తిని వదిలిపెట్టి.. ఖాకీ చుక్కకూ ఉన్న మర్యాదను నాశనం చేశాడు. సమాజంలో పోలీసులకు ఉన్న గౌరవాన్ని పోగొట్టాడు. కానీ చివరికి ఆ ఖాకీ దొరికిపోయాడు. అయితే ఈ వ్యవహారంలో అనేక మలుపులు చోటుచేసుకున్నాయి. ఇంతకీ ఆ దొంగ ఖాకీ ఎలా దొరికాడంటే..ఓ వ్యక్తి దాదాపు 3,000 కోట్ల ఆర్థిక నేరానికి పాల్పడ్డాడు. హైదరాబాద్ నుంచి ముంబై వెళ్ళిపోయాడు. ఈ క్రమంలో అతడిని హైదరాబాద్ తీసుకురావడానికి పోలీసులు టాస్క్ ఫోర్స్ బృందాన్ని ముంబై పంపించారు. అక్కడికి వెళ్ళిన తర్వాత ఆ టాస్క్ ఫోర్స్ బృందంలో ఉన్న ఎస్ఐ శ్రీకాంత్ ఆలోచన మరో విధంగా మారింది. ఏకంగా దొంగకు సద్దికూడు మాయడానికి సిద్ధమయ్యాడు. అంతేకాదు అతని ద్వారా డబ్బులు తీసుకొని కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేశాడు.వాస్తవానికి ఆ నేరస్థుడిని ముంబైలో పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం హైదరాబాద్ తీసుకుని వస్తుండగా శ్రీకాంత్ అడ్డగోలు వ్యవహారానికి పాల్పడ్డాడు. ఆ ఆర్థిక నేరగాడితో రెండు కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంతేకాదు అతడిని ముంబై తీసుకొస్తుండగా శ్రీకాంత్ వదిలేసాడు.రెండు కోట్లను శ్రీకాంత్ పై అధికారులకు కూడా ఇచ్చినట్టు తెలుస్తోంది. శ్రీకాంత్ తో పాటు అధికారుల పాత్ర పై పోలీసు ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపారు. తుది నివేదికను సిపి సజ్జనార్ కు అందజేయడంతో.. ఆయన సదరు ఎస్ఐపై చర్యలు తీసుకున్నారు. అతడిని సస్పెండ్ చేయడంతో పాటు.. అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.ఆ ఆర్థిక నేరగాడిని హైదరాబాద్ తీసుకొస్తుండగా ఎస్ఐ శ్రీకాంత్ పోలీసులను ఏ మార్చాడు. తాను మాత్రం నిందితుడితో వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నాడు. మిగతా పోలీసులను వేరే వాహనంలో పంపించాడు. రెండు వాహనాలకు దాదాపు 30 కిలోమీటర్ల దూరం ఉండే విధంగా ప్రణాళిక రూపొందించుకున్నాడు. వస్తుండగానే ఆర్థిక నేరగాడు కుటుంబ సభ్యులకు ఎస్ఐ ఫోన్ చేశాడు.ఓ హోటల్ వద్దకు వచ్చి రెండు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆర్థిక నేరగాడి కుటుంబ సభ్యులు హోటల్ వద్దకు వచ్చి రెండు కోట్లు ఇచ్చి వెళ్లిపోయారు. ఆ తర్వాత నిందితుడిని ఎస్ఐ వదిలిపెట్టాడు. అంతేకాదు తాను హోటల్ వద్ద వాహనం ఆపినప్పుడు అతడు పారిపోయాడని ఉన్నతాధికారులకు చెప్పాడు. ఈ విషయం డిపార్ట్మెంట్ అధికారులకు అనుమానంగా అనిపించడంతో ఎంక్వయిరీ మొదలుపెట్టారు. అన్ని విధాలుగా పరిశీలించి ఆర్థిక నేరగాడి కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు తీసుకొని వదిలేసాడని నిర్ధారణకు వచ్చారు. శ్రీకాంత్ 2020 బ్యాచుకు చెందిన అధికారి. అయితే అతడు కొంతకాలంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

# తెలుగు భాషకు కీర్తి కిరీటం మేడసాని మోహన్

## మేడసానికి జానమద్ది సాహిత్య పురస్కారం ప్రదానం



**తిరుపతి, సూర్య వాస్తవం, నవంబర్ 2:** పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ తెలుగు భాషకు కీర్తి కిరీటం లాంటి వారని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కొనియాడారు. కడప నగరంలోని సి.పి. బ్రౌన్ గ్రంథాలయం మరియు భాషా పరిశోధన కేంద్రంలో జానమద్ది సాహితీ పీఠం, కడప వారు ఆదివారం మేడసానికి "జానమద్ది స్మారక సాహిత్య మరియు గ్రంథాలయ సేవా పురస్కారాన్ని" ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా అవధాన రంగంలో రాణిస్తున్న మేడసాని మోహన్ తెలుగుజాతి వైభవాన్ని ప్రపంచానికి చాటారని కొనియాడారు. తెలుగు, సంస్కృత సాహిత్యం మీద ఆసక్తి పెంచుకోవడంతోపాటు, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందారని కితాబిచ్చారు. విద్యార్థి దశ నుంచి యోగా సాధన చేసి జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకున్నాడని వెంకయ్య గుర్తు చేశారు. పదిహేనేళ్ళ వయసులో అవధానం చేసి పండితులచే ప్రశంసలందుకున్న మేడసాని మోహన్ భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మేడసాని మోహన్ మాట్లాడుతూ జానమద్ది సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం తనకెంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విద్యార్థులు, పరిశోధకులు, తెలుగు పండితులు విశేషంగా పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పథకాల అమలు

### - ఎంపీడీవోఏపీ ఆర్ కుమార్



**శాంతిపురం, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ,కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ద్వారా ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ కార్యక్రమాలు పథకాలు అమలు చేయబడుతున్నది. ఈ పథకాలలో సౌరశక్తి, గృహ నిర్మాణం ,పరిశ్రమలు, హై మస్ట్ లైట్స్, హెచ్ ఎన్ ఎన్ ఎస్ ,ఎన్టీఆర్ సుజల, రోడ్లు , ఐ హెచ్ హెచ్ ఎల్, ఎన్టీఆర్ భరోసా, పెన్షన్ గోకులం షెడ్లు, వీధిలైట్లు, దీపం గ్యాస్ కనెక్షన్ మహిళల కోసం శ్రీ శక్తి (ఉచిత బస్సు) పథకాలు అమలు చేయబడుతుంది. రాబోవు రెండు సంవత్సరాలలో కుప్పం నియోజకవర్గాన్ని "స్వర్ణకుప్పం స్వచ్ఛ కుప్పం"గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్య పథకాలు అమలు జరపడుతున్నది. ఈ ప్రతిష్టాత్మకమైనటువంటి పథకాలు పూర్తి స్థాయిలో వినియోగించుకొనుటకు తద్వారా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెంది పేదరికం లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు పనులు జరుగుతున్నవి .ప్రస్తుతం అమలు జరుగుతున్నటువంటి పనులు పథకాలను ప్రజలకి మరింత దగ్గరగా తీసుకుని వెళ్లడానికి ,అవగాహన కల్పించుటకు సృజనాత్మకంగా కళాజాత కార్యక్రమాలు షార్ట్ ఫిలిమ్స్ ను స్క్రీనింగ్ పై ప్రదర్శించడం ద్వారా అవగాహన కల్పించబడుతున్నది . ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను శాంతిపురం మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలోనూ నిర్వహిస్తున్నారు. కెనమాకునపల్లి గ్రామంలో కళాజాత వారి ద్వారా ప్రభుత్వ పథకాల గురించి వ్యక్తిగత మరుగుదొడ్ల గురించి అవగాహన కల్పించారు రాళ్ళబూదూగురు గ్రామంలో షార్ట్ ఫిలిం ద్వారా లఘు చిత్ర ప్రదర్శనతో పథకాల గురించి మరుగుదొడ్ల అవసరాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజకీయ నాయకులు,సర్పంచు,వార్డ్ మెంబర్లు,పంచాయతీ కార్యదర్శులు సచివాయల సిబ్బంది పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరు అయి ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకొని గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలను కళాజాత రూపాలలో ప్రదర్శించడం చూసి చాలా బాగుందని సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ పి ఆర్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల నుండి వచ్చిన స్పందనను దృష్టిలో పెట్టుకొని మండలంలో అన్ని గ్రామాలలో కూడా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

### మంత్రి శ్రీధర్‌బాబు కామెంట్స్‌పై

# నెటిజన్ల సెటైర్లు



**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ఆశ పడవచ్చు. కానీ ఆ ఆశకు హద్దు ఉండాలి.. అర్హత ఉండాలి. దానిని సాధించాలి అన్న తపన ఉండాలి. కష్టపడాలి. అందరినీ కలుపుకుపోవాలి. రాజకీయాల్లో నేతలకు ఆశలు ఎక్కువ. పదవీ వ్యామోహంతోపాటు, సంపాదించాలి.. కీలక పదవులు అలంకరించాలని ఆశపడతుంటారు. చాలా మందికి అవి నెరవేరవు. కొందరికి అదృష్టంతో కలిసి వస్తాయి. అయితే ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ నేతల ఆశలు చూస్తే మాత్రం అత్యాశే అనిపిస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన చాలా హామీలు నెరవేర్చలేదు. ఇక హైడ్రా, ధాన్యానికి బోనస్, పింఛన్ల పెంపు, మహిళలకు రూ. 2,500 సాయం, విద్యార్థినులకు స్కూటీలు వంటివి అమలుకు నోచుకోలేదు. హైడ్రా హైదరాబాద్ వాసులను దెబ్బతీస్తోంది. ఇలాంటి తరుణంలో హస్తం నేతలు తాము రాబోయే 30 ఏళ్లు అధికారంలో ఉంటామని వ్యాఖ్యానించడం కొత్త చర్చకు దారితీసింది. మొన్నటి వరకు రేవంత్‌రెడ్డి పదేళ్లు నేనే సీఎం అని ప్రకటించారు. ఇప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు 30 ఏళ్లు తమదే అధికారం అని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో మాజీ క్రికెట్ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ మంత్రి పదవి గురించి 'మీడియాలోనే తెలిసింది, నాకు అధికారిక సమాచారం లేదు' అని చెప్పడం పార్టీలో అంతర్గత విభేదాలకు నిదర్శనం. శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత, పార్టీ 'రైజింగ్ తెలంగాణ' విజన్‌తో ముందుకు సాగుతోంది. ఆరు హామీల అమలు, ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి చర్యలు ప్రజల్లో బలం పెంచాయి. అయితే 30 ఏళ్లు అధికారం అత్యాశే అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బీజేపీ బలపడటం, బీఆర్ఎస్ పునరుద్ధరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హామీలు నెరవర్చేకపోవడం పెద్ద మైనస్. కాంగ్రెస్‌లో మంత్రులు బహిరంగంగా వ్యాఖలు వివాదాస్పదమవుతున్నాయి. దీనిపై శ్రీధర్‌బాబు స్పందిస్తూ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ అని పేర్కొన్నారు. ఇది ఒకవైపు సానుకూలం.. మరోవైపు బలహీనత కూడా. కాంగ్రెస్ అంటేనే కుమ్ములాటలు. ఒకరి ఎదుగుదలను మరొకరు ఓర్వలేనంత ప్రజాస్వామ్యం. ఇలాంటి పార్టీ ప్రజలను ఆకట్టుకుని 30 ఏళ్లు అధికారంలో ఉండడం అంత ఈజీ కాదు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అంతర్గత విభేదాలు, విపక్షాల పునరుజ్జీవనం, ఆర్థిక సమస్యలు. బీఆర్ఎస్ యువతను ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది. బీజేపీ జాతీయ అంశాలతో బలపడుతోంది. అయితే, యువత ఉద్యోగాలు, మహిళల సాధికారత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వంటివి పార్టీని బలపరుస్తాయి. శ్రీధర్ బాబు వంటి నాయకులు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, ఏకత్వాన్ని కాపాడితే, ఈ కల సాధ్యం కావొచ్చు. కానీ రాజకీయ చరిత్ర చూస్తే, దీర్ఘకాలిక ఆధిపత్యం పాలసీలపై ఆధారపడి ఉంటుంది, వ్యక్తిగత వ్యాఖ్యలపై కాదు. శ్రీధర్ బాబు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లోని ధైర్యాన్ని చూపిస్తున్నాయి, కానీ అవి పరీక్షల సూచనలు కూడా. 30 ఏళ్లు ఆధిపత్యం కలలు కాకుండా నిజమవ్వాలంటే, అంతర్గత ఏకత్వం, పారదర్శకత, ప్రజా సంక్షేమం మీద దృష్టి పెట్టాలి. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటారు ? కాంగ్రెస్ దాన్ని అందిస్తే, ఈ కల నిజమవుతుంది. లేకపోతే, రాజకీయాల్లో ఆర్పు తప్పదు

### ట్రంప్ అధికారాలకు

# సెనెట్ చెక్



**న్యూయార్క్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** అమెరికా ఫస్ట్.. గ్రేట్ అమెరికా మేక్ ఎగైన్ నినాదాలతో అమెరికన్లను ఆకట్టుకుని.. రెండోసారి అధికారంలోకి వచ్చాడు డొనాల్డ్ ట్రంప్. ఆయన బాధ్యతలు చేపట్టి పది నెలలైంది. కానీ అమెరికన్లు, అమెరికాలోని విదేశీయులు, ప్రపంచ దేశాలు.. పది నెలల పాలను పదేళ్ల భారంగా భావిస్తున్నారు. అమెరికా ఫస్ట్ పేరుతో ట్రంప్ చేస్తున్న అరాచకాలతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. నచ్చిన దేశాలపై తక్కువ.. మాట వినని దేశాలపై భారీగా దిగుమతి సుంకాలు(టారిఫ్‌లు) విధించారు. టారిఫ్‌ల అంశం తన పరిధిలో లేకపోయినా ఏకపక్షంగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నారు. అయితే ట్రంప్ దూకుడుకు సెనెట్ బ్రేక్ వేసింది. అంతర్జాతీయ టారిఫ్‌లను సెనెట్ గట్టిగా వ్యతిరేకించింది. 51?47 ఓట్లతో టారిఫ్‌ను ఓడించింది. దీంతో వాణిజ్య యుద్ధాలు ముగిసే అవకాశం కనిపిస్తోంది. ఇది రెండు పార్టీల సమ్మతితో జరిగిన మొదటి పెద్ద విజయం, దేశీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపిస్తోంది. సెనెట్‌లో డెమోక్రట్లు ప్రధానంగా మద్దతు ఇచ్చినప్పటికీ, నలుగురు రిపబ్లికన్ సెనేటర్లు కీలకంగా మలుపు తిప్పారు. ఈ వారం ముందు బ్రెజిల్, కెనడా టారిఫ్‌లపై కూడా సారూప్య ఓట్లు జరిగాయి. ఈ ఘటనలు ట్రంప్ విధానాలకు సవాల్‌గా మారాయి. ఆర్థిక నిపుణులు ధరల పెరుగుదలను నివారించే అవకాశంగా చూస్తున్నారు. ఇది కాంగ్రెస్ అధికారాలను పునరుద్ధరించే సంకేతం. టారిఫ్‌లు రద్దు కావడంతో దిగుమతులు సులభతరమవుతాయి. ఉత్పత్తి ధరలు తగ్గుతాయని నిపుణులు అంచనా. ఇది ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో లాభాలను పెంచుతుంది. అయితే, దేశీయ ఉత్పాదకులకు సవాళ్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే విదేశీ పోటీ తీవ్రమవుతుంది. మొత్తంగా, ఈ మార్పు జీడీపీ పెరుగుదలకు సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. సెనెట్ నిర్ణయం ట్రంప్ పాలనకు పెద్ద దెబ్బ. రిపబ్లికన్ పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. 2026లో జరిగే ఎన్నికలపై ఇవి ప్రభావం చూపుతాయి. ట్రంప్ ఈ చర్యలను 'అత్యవసరం'గా ప్రకటించినా, సెనెట్ దాన్ని ప్రతిపక్షం చేసింది. ఇది అధ్యక్ష అధికారాలను పరిమితం చేసే చట్టాల చర్చను రేకెత్తిస్తుంది. దీంతో ఇకపై ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని సెనెట్ స్పష్టం చేసింది. ఈ బిల్లు ఇప్పుడు హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో చర్చకు వస్తుంది, అక్కడ కూడా బైపార్టిసన్ మద్దతు ఉండవచ్చు. దీంతో అంతర్జాతీయంగా, చైనా, యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలు మెరుగుపడతాయి, వాణిజ్య ఒప్పందాలు త్వరగా ఏర్పడతాయి. ట్రంప్ ప్రతిస్పందన ఈ ప్రక్రియను ప్రభావితం చేస్తుంది.

# హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** శేరిలింగంపల్లి, అమీన్ పూర్ బార్డర్ లోని ఓ అపార్ట్మెంట్ ను హైడ్రా సిబ్బంది కూల్చివేసారు. మియాపూర్ సర్వే నెంబర్ 100 ప్రభుత్వ భూమి అని స్థానికుల పిర్యాదు మేరకు కూల్చివేతలు చేపట్టారు. బిల్డర్ అమీన్ పూర్ సర్వే నెంబర్ లు వేసి నిర్మాణం చేపట్టినట్లు గుర్తించారు.

# జగజ్జేత భారత్

**స్వప్నం సాకారమైంది. మహిళల క్రికెట్‌కు మరో అగ్రజట్టు వచ్చేసింది. ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ చాంపియన్‌గా భారత్ అవతరించింది. 2005, 2017లో ఊరించిన ఐసీసీ ప్రపంచకప్‌ను మనోళ్లు 2025లో పట్టేశారు. భారత మహిళల జట్టుకు ఇదే తొలి ఐసీసీ ప్రపంచకప్ టైటిల్ విజయం. అమ్మాయిలు సాధించారు. అందని ద్రాక్ష అనుకున్న ఐసీసీ ప్రపంచకప్ టైటిల్‌ను దక్కించుకున్నారు. ఈ జట్టుతో విజేతగా నిలువటం సాధ్యమేనా అనుకునే దశ నుంచి భారత మహిళల క్రికెట్ దశ దిశను మార్చుతున్న జట్టు ఇదే అనే స్థాయికి హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఎదిగింది. తొలిసారి టైటిల్ పోరుకు చేరుకున్న దక్షిణాఫ్రికా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. షెఫాలీ వర్మ (87, 2/36), దీప్తి శర్మ (58, 5/39) బ్యాట్‌తో, బంతితో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అద్భుత ప్రదర్శన చేశారు. షెఫాలీ, దీప్తి అర్థ సెంచరీలతో తొలుత 298 పరుగుల భారీ స్కోరు చేసిన భారత్.. వికెట్ల వేటలో ఆ ఇద్దరి మాయాజాలంతో దక్షిణాఫ్రికాను 246 పరుగులకు కుప్పకూలింది. 52 పరుగుల తేడాతో భారత్ చారిత్రక విజయం సాధించింది. 2025 ఐసీసీ మహిళల ప్రపంచకప్ చాంపియన్‌గా అవతరించింది.**

**ముంబయి-సూర్య వాస్తవం:**
ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీ మన సొంతమైంది. గ్రూప్ దశలో మిశ్రమ ప్రదర్శనతో కంగారు పెట్టినా.. సెమీఫైనల్లో అసమాన రీతిలో ఆస్ట్రేలియాను ఓడించిన భారత్ ఆదివారం ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులోనూ అదరగొట్టింది. బ్యాట్, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ దక్షిణాఫ్రికాపై పైచేయి సాధించిన భారత్ తొలిసారి ఐసీసీ ప్రపంచకప్‌ను ముద్దాడింది. స్పిన్నర్లు దీప్తి శర్మ (5/39), షెఫాలీ వర్మ (2/36) కలిసి ఏడు వికెట్లతో మాయాజాలం సృష్టించగా 299 పరుగుల భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 246 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లారా వోల్వార్ట్ (101, 98 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో ఒంటరి పోరాటం చేసినా.. మరో ఎండ్ నుంచి సరైన సహకారం దక్కలేదు. టజ్మిన్ బ్రిట్స్ (23), సునె లుస్ (25), అనెరి డెర్క్‌సెన్ (35)లు మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగులు చేసింది.

షెఫాలీ వర్మ (87, 78 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), దీప్తి శర్మ (58, 58 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో రాణించారు. స్మృతీ మంధాన (45, 58 బంతుల్లో 8 ఫోర్లు), రిచా ఘోష్ (34, 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. దక్షిణాఫ్రికా బౌలర్ ఖకా (3/58) మూడు వికెట్లు పడగొట్టింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన షెఫాలీ వర్మ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. అంతకుముందు, వర్షంతో ఫైనల్ మ్యాచ్ రెండు గంటలు ఆలస్యంగా ఆరంభమైంది. రిజర్వ్ డే అందుబాటులో ఉన్నా.. ఎటువంటి ఓవర్ల కోత లేకుండా ఆదివారమే అంతిమ పోరు ముగిసింది.

**షెఫాలీ, దీప్తి దూకుడు**
వర్షం ప్రభావిత మ్యాచ్‌లో టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పిచ్‌పై తేమ, పదునైన పేస్‌తో ఆరంభంలో వికెట్లు ఆశించిన సఫారీలకు ఓపెనర్లు షెఫాలీ వర్మ (87), స్మృతీ మంధాన (45) చెక్ పెట్టారు. సావధానంగా ఆడిన ఓపెనర్లు పవర్‌ప్లేలో వికెట్ నష్టపోకుండా 64 పరుగులు జోడించారు. మంధాన, షెఫాలీ మెరవటంతో తొలి వికెట్‌కు భారత్ 104 పరుగులతో అదిరే ఆరంభం అందుకుంది. అర్థ సెంచరీ ముంగిట స్మృతీ నిష్క్రమించినా.. షెఫాలీ జోరు తగ్గలేదు. 5 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 49 బంతుల్లోనే అర్థ శతకం సాధించింది. సెమీస్ స్టార్ జెమీమా రొడ్రిగ్స్ (24)తో కలిసి షెఫాలీ మరో 62 పరుగుల భాగస్వామ్యంలో మెరిసింది. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిసిన షెఫాలీ వన్డేల్లో కెరీర్ ఉత్తమ స్కోరు సాధించింది. 166/1తో భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను ఖకా నిలువరించింది. వరుసగా షెఫాలీ, జెమీమా రొడ్రిగ్స్‌ను సాగనంపి సఫారీలను రేసులోకి తెచ్చింది. మిడిల్ ఆర్డర్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ (20) సహా ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ (12) అంచనాలను అందుకోలేదు.

ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58), వికెట్ కీపర్ రిచా ఘోష్ (34) ఆఖర్లో భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. సహజశైలిలో నెమ్మదిగా ఆడిన దీప్తి వికెట్ల మధ్య చురుగ్గా పరుగులు తీసింది. 2 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 53 బంతుల్లో అర్థ సెంచరీ సాధించింది. రిచా ఘోష్ కాస్త వేగంగా ఆడింది. 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో ధనాధన్ షో చూపించింది. దీంతో భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు చేసింది. మిడిల్‌లో (11-40 ఓవర్లు) 4 వికెట్లకు 165 పరుగులు చేసిన భారత్.. ఆఖరు పది ఓవర్లలో 3 వికెట్లకు 69 పరుగులు సాధించింది. ఆరంభంలో షెఫాలీ, మంధాన%ౌ% ఆఖర్లో దీప్తి శర్మ, రిచా ఘోష్‌లు బాధ్యతాయుత ఇన్నింగ్స్‌లు ఆడారు. సఫారీ బౌలర్లలో ఖకా (3/58) మూడు వికెట్లతో రాణించింది.

**లారా పోరాటం వృథా**
ప్రపంచకప్ ఫైనల్. సఫారీ లక్ష్యం 299 పరుగులు. డివై పాటిల్ స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలం. అయినా, టైటిల్ పోరు ఒత్తిడిలో ఛేదన అంత సులువు కాదు. ఓపెనర్లు లారా వోల్వార్ట్ (101), టజ్మిన్ బ్రిట్స్ (23) చక్కటి భాగస్వామ్యం అందించారు. తొలి వికెట్‌కు ఓపెనర్లు 52 పరుగులు జోడించారు. వికెట్ల మధ్య పరుగులో సమన్వయ లోపంతో బ్రిట్స్ రనౌట్‌గా నిష్క్రమించింది. పవర్‌ప్లే ఆఖరు ఓవర్లో భారత్ బ్రేక్ సాధించింది. ఆ తర్వాత శ్రీ చరణి మాయ చేసింది. ప్రమాదకర అన్నెకె బాచ్ (0)ను ఎల్బీగా అవుట్ చేసింది. దీంతో 62/2తో దక్షిణాఫ్రికా ఒత్తిడిలో పడింది. ఓపెనర్ లారా వోల్వార్ట్ ఓ ఎండ్‌లో నిలబడింది. దూకుడుగా ఆడుతూ రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచింది. సునె లుస్ (25), లారా జోడీ మూడో వికెట్‌కు 51 బంతుల్లో 52 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇక్కడే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ మంత్రాంగం పని చేసింది.

పార్ట్‌టైమ్ స్పిన్నర్ షెఫాలీ వర్మ చేతికి బంతిని ఇచ్చిన హర్మన్‌కౌర్.. వరుస ఓవర్లలో వికెట్లు రాబట్టుకుంది. లుస్ రిటర్న్ క్యాచ్‌తో నిష్క్రమించగా.. మారిజానె కాప్ (4) లెగ్‌సైడ్ షాట్‌కు వెళ్లి వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చింది. షెఫాలీ వరుస ఓవర్ల వికెట్లు దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బకొట్టింది. అనెరి డిర్క్‌సెన్ (35), లారా ఆరో వికెట్‌కు 61 పరుగులు జోడించి సఫారీ శిబిరంలో ఆశలు రేపారు. 7 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 45 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన లారా.. 11 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 96 బంతుల్లో సెంచరీ సాధించింది. రాధ ఓవర్లో వరుస సిక్సర్లతో చెలరేగిన డెర్క్‌సెన్.. భారత్‌ను ఒత్తిడికి గురి చేసింది. దీప్తి శర్మ మాయాజాలంతో డెర్క్‌సెన్ సహా జాఫ్టా, ట్రయాన్‌లు పెవిలియన్‌కు చేరారు. సెంచరీ తర్వాత లారా సైతం వికెట్ కోల్పోవటంతో సఫారీ ఆశలు ఆవిరయ్యాయి. 45.3 ఓవర్లలో దక్షిణాఫ్రికా 246 పరుగులకు ఆలౌటైంది. 52 పరుగుల తేడాతో భారత్ చారిత్రక విజయం సాధించింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ (5/39) ఐదు వికెట్లతో మాయ చేయగా.. షెఫాలీ వర్మ (2/36) కీలక వికెట్లతో ఆకట్టుకుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : స్మృతీ మంధాన (సి) జఫ్టా (బి) ట్రయాన్ 45, షెఫాలీ వర్మ (సి) లుస్ (బి) ఖకా 87, జెమీమా రొడ్రిగ్స్ (సి) వొల్వోర్ట్ (బి) ఖకా 24, హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) మలబా 20, దీప్తి శర్మ (రనౌట్) 58, అమన్‌జోత్ కౌర్ (సి,బి) డిక్లర్క్ 12, రిచా ఘోష్ (సి) డెర్క్‌సెన్ (బి) ఖకా 34, రాధ నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 15, మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 298.

వికెట్ల పతనం : 1-104, 2-166, 3-171, 4-223, 5-245, 6-292, 7-298.

బౌలింగ్ : మారిజానె కాప్ 10-1-59-0, అయబోంగ ఖకా 9-0-58-3, మలబా 10-0-47-1, నదినె డిక్లర్క్ 9-0-52-1, సునె లుస్ 5-0-34-0, చోలె ట్రయాన్ 7-0-46-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : లారా వోల్వార్ట్ (బి) అమన్‌జోత్ (బి) దీప్తి 101, టజ్మిన్ బ్రిట్స్ (రనౌట్) 23, బాచ్ (ఎల్బీ) శ్రీచరణి 0, సునె లుస్ (సి,బి) షెఫాలీ వర్మ 25, మరిజానె కాప్ (సి) ఘోష్ (బి) షెఫాలీ వర్మ 4, సినాలో జాఫ్టా (సి) రాధ (బి) దీప్తి 16, అనెరి డెర్క్‌సెన్ (బి) దీప్తి 35, ట్రయాన్ (ఎల్బీ) దీప్తి 9, నదినె (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 18, ఖకా (రనౌట్) 1, మలబా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (45.3 ఓవర్లలో ఆలౌట్) 246.

వికెట్ల పతనం : 1-51, 2-62, 3-114, 4-123, 5-148, 6-209, 7-220, 8-221, 9-246, 10-246.

బౌలింగ్ : రేణుక సింగ్ 8-0-28-0, క్రాంతి గౌడ్ 3-0-16-0, అమన్‌జోత్ కౌర్ 4-0-34-0, దీప్తి శర్మ 9.3-0-39-5, శ్రీ చరణి 9-0-48-1, రాధ యాదవ్ 5-0-45-0, షెఫాలీ వర్మ 7-0-36-2.

ఐసీసీ 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రధాని నరెంద్ర మోడీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మెన్ శివసేనా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానులకు మా ధన్యవాదాలు. గ్రూప్ దశలో వరుసగా మూడు ఓటములు చవిచూసినా మాపై విశ్వాసం ఉంచారు. లారా, లుస్ మంచిగా ఆడుతున్నారు. ఆ సమయంలో షెఫాలీని చూశాను. షెఫాలీ అర్థ సెంచరీతో సత్తా చాటింది. ఆత్మవిశ్వాసంతో ఉన్న షెఫాలీకి ఓ ఓవర్ ఇవ్వాలని అనిపించింది. ఆ నిర్ణయమే మ్యాచ్ గతిని మార్చివేసింది. రెండేండ్లుగా ఈ విజయం కోసమే శ్రమించాం. ప్రపంచకప్ కప్పు కొట్టాలని సంకల్పంతో కష్టపడ్డాం, సాధించాం. ఇప్పుడు టైటిల్స్ సాధించటం అలవాటుగా మార్చుకోవటమే మా లక్ష్యం. %-% హర్మన్‌ప్రీత్ కౌర్, భారత కెప్టెన్

ఫైనల్లో ఈ ప్రదర్శన కోసమే నేను జట్టులోకి వచ్చినట్టుంది. ప్రపంచకప్ విజయం అనుభూతిని మాటల్లో చెప్పలేను. జట్టులో నా పాత్రపై పూర్తి స్పష్టత ఉంది. నా సహజశైలిలో ఆడమని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వెన్నుతట్టింది. ఇది నా జీవితంలో ఓ ప్రత్యేక సందర్భం. సచిన్ టెండూల్కర్‌ను గ్రౌండ్‌లో చూడగానే నా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. %-% షెఫాలీ వర్మ, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్

నాకు ఇది కలలా అనిపిస్తోంది. ప్రపంచకప్ ఫైనల్లో రాణించటం సంతోషంగా ఉంది. జట్టులో ఏ బాధ్యత ఇచ్చినా.. ఆస్వాదించాను. పరిస్థితులకు తగినట్టు ఆడాలని అనుకున్నాను. ఆల్‌రౌండర్ రాణించటం మాటల్లో వర్ణించలేని ఆనందంగా ఉంది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును మా అమ్మానాన్నలకు అంకితం ఇస్తున్నాను. %-% దీప్తి శర్మ, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ (215 పరుగులు, 22 వికెట్లు)













Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



# రేర్ ఎలిమెంట్స్ అన్వేషణలో భారత్





**న్యూఢిల్లీ, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ప్రస్తుతం ప్రపంచంలో ఏం నడుస్తుంది అంటే.. ఒకవైపు అమెరికా టారిఫ్‌లు.. ఇంకోవైపు రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ప్రపంచ దేశాల మధ్య పోటీ. ఎందుకంటే వీటి అవసరం అన్ని దేశాలకు ఉంది. కానీ, ఇవి దొరకడం అరుదు. అందుకే వీటిపై ఆధిపత్యం కోసం అమెరికా, చైనా పోటీ పడుతున్నాయి. ప్రస్తుతం చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే ఇందులోకి ఇప్పుడు భారత్ కూడా ఎంటర్ అవుతోంది. రియర్ ఎర్త్ మెటల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ రికార్డ్ స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా విద్యుద్దీకరణ, పునరుత్పాదక విద్యుత్, అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వీటి వినియోగం కీలకంగా మారింది. 2023లో 2 లక్షల మెట్రిక్ టన్నుల డిమాండ్ ఉండగా, 2030 కల్లా 4 లక్షలకు చేరే అవకాశం ఉంది. ఇండస్ట్రీ అవసరాల కారణంగా మెగ్నెట్ తయారీకి అవసరమైన నియోడైమియం, ప్రసియోడైమియం, డిస్ప్రోసియం వంటి రేర్ ఎర్త్ డిమాండ్ 10 శాతం వృద్ధి కనిపిస్తోంది. భారత్‌లో మొత్తం 8.52 మిలియన్ టన్నులు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ నిల్వలు ఉన్నాయి. వీటిల్లో 7.23 మిలియన్ టన్నులు మోనజైట్‌లో, 1.29 మిలియన్ టన్నులు గుజరాత్, రాజస్తాన్‌లోని హార్డ్ రాక్ డిపాజిట్లలో ఉన్నాయి. దేశంలోని తీర ప్రాంతాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, కేరళ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, జార్ఖండ్ మొదలైన రాష్ట్రాల్లో ఎక్కువగా ఈ ఖనిజాలు ఉన్నాయి. జాతీయ శాస్త్రీయ సంస్థలు నూతనమైన వెలికితీత, శుద్ధీకరణ పనుల్లో ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఇవి ప్రపంచవ్యాప్తంగా అరుదుగా కనిపిస్తున్నా. ముఖ్యంగా ఉత్పత్తి, శుద్ధీకరణ ఖర్చులు ఎక్కువ. భారత ఖనిజాల్లో లైట్ రేర్ ఎర్త్ అంటే 'ఎల్ఐఆర్' ఇక్స్‌ట్రాక్టేబుల్‌గా ఉండగా, హెవీ రేర్ ఎర్త్ 'హెచ్ఐఆర్' కావలసినంతగా లభ్యం కావు. తీర ప్రాంతాల్లోని మోనజైట్ ఇసుకల్లో వీటి కొంత భాగం ఉంటుంది. అయినప్పటికీ, భారత్ రిఫైనింగ్, మధ్యవర్తి ఉత్పత్తుల తయారీ వంటి లోతైన వ్యవస్థలు అభివృద్ధి చేయాల్సిన అవసరముంది. భారత్‌లో మైనింగ్, రిఫైనింగ్, అలాయ్ తయారీ, మెగ్నెట్ ప్రాసెసింగ్ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఇటీవల చైనా దిగుమతి నియంత్రణలు, తీర ప్రాంత నిబంధనలు, అధునాతన యంత్రాలు లేని సమస్యలు భారత్ ప్లాన్‌లను దెబ్బతీశాయ్. కొత్తగా ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్, ప్రైవేట్ పార్టనర్‌షిప్, కజకిస్థాన్‌తో ఒప్పందాలు వంటి చర్యలు భారతానికి డ్రైవ్‌ని ఇస్తున్నాయి. చైనా 49% రిజర్వ్, 69% మైనింగ్, 90% రిఫైనింగ్‌లో ఆధిపత్యం చూపుతోంది. అమెరికా, యూరప్, జపాన్, భారత్ రికవరీ యత్నాలు ప్రారంభించాయి. భారత్‌లో నిల్వలు విస్తృతంగా ఉన్నా, ఉత్పత్తి?శు ద్ధీకరణ?మెగ్నెట్ తయారీకి సమయం పడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలు, సాంకేతిక చర్యలు, ప్రైవేట్?పబ్లిక్ భాగస్వామ్యాలతో పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయి. త్వరగా ఉత్పత్తి ప్రారంభిస్తే భారత్ రేర్ ఎర్త్ రంగంలో పూర్తిగా ఆధిపత్యం సాధించకపోయినా కీలక శక్తిగా ఎదిగే అవకాశం ఉంటుంది.



# వినాయకుని సేవలో సినీ హీరో నారా రోహిత్

**ఐరాల, సూర్య వాస్తవం, నవంబర్ 2:** స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం నందు గల స్వామివారిని దర్శించుకున్న సినీ నటుడు మరియు మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు నారా రామమూర్తి నాయుడు కుమారుడు నారా రోహిత్, నూతన వధూవరులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, ముందుగా ఆలయం వెలుపల నూతన వధూవరులను స్వాగతం పలికి దుశ్యాలతో సత్కరించిన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మణి నాయుడు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు .



# జర్నలిస్ట్ సాంబశివాచారి కుటుంబాన్ని ఆదుకుంటాం

## - ఏపీడబ్ల్యూజేఎఫ్ హామీ



**గంగాధరనెల్లూరు, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు,రాజ్ న్యూస్ రిపోర్టర్ సాంబశివచారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు హామీ ఇచ్చారు ప్రమాదంలో మరణించిన సాంబశివ ఆచారి పార్థివదేహన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుం బానికి తాత్కాలిక ఉపశమనం కింద యూనియన్ 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ సాంబశివాచారి జర్నలిస్టు సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహించారని అన్నారు, ఏపీడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి తీవ్ర కృషి చేశారన్నారు. ఆయన మృతి జర్నలిస్ట్ ఉద్యమానికి తీరని లోటు అన్నారు అర్పించిన వారిలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజక్షులు,ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజులు,నియోజకవర్గ సెక్రటరీ దేవరాజులు జిల్లా సహాయ కార్యదర్శిలు జయప్రకాష్ విజయ్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి బాలాజీ సివిఆర్ పార్థు నాగరాజు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బ్రీత్ అనలైజర్ ప్రామాణికం కాదా..

**హైదరాబాద్, సూర్య వాస్తవం, నవంబర్ 2:** డ్రంకన్ డ్రైవ్‌ను అరికట్టేందుకు పోలీసులు బ్రీత్ అనలైజర్‌ను ప్రధానంగా వాడుతున్నారు. ఇప్పుడు దీన్ని చాలా కంపెనీలు, సంస్థలు కూడా వాడుతున్నాయి. ఉద్యోగులు, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ పరీక్షలు చేస్తుంటారు. అయితే దీనిపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక ఉద్యోగిని తీసేందుకు కేవలం ఈ పరీక్షలను ఆధారంగా చేసుకోవద్దని స్పష్టం చేసింది. తర్వాత పరీక్షలు నిర్వహించి ఉద్యోగం తీయడంపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. బ్రీత్ అనలైజర్ పరీక్షలు ఆర్టీసీలో కూడా చేస్తున్నారు. ఉద్యోగానికి వచ్చిన వెంటనే డ్రైవర్, కండక్టర్లకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానం ఉన్న వారిని పక్కన పెడుతున్నారు. ఇలాంటి కేసులో ఏకంగా ఓ ఉద్యోగిని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని తెలంగాణ హైకోర్టు తప్పుపట్టింది. కేవలం బ్రీత్ అనలైజర్ పరీక్షతో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సరికాదని తేల్చి చెప్పింది. రక్త పరీక్షలు ఇతర పరీక్షలు నిర్వహించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని పేర్కొంది. మదిరిడిపోకు చెందిన డ్రైవర్‌ను డిపోమేనేజర్ ఉద్యోగం నుంచి తొలగించారు. ఏప్రిల్ 25న తీసుకున్న ఈ నిర్ణయం వివాదాస్పదమైంది. మద్యం సేవించి ఉద్యోగానికి వచ్చారని, అంతే కాకుండా స్థానికంగా జరిగిన ధర్నాలో కూడా పాల్గొన్నారనే కారణంతో ఈ చర్యలు తీసుకున్నారు. తన వాదన వినకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడంపై ఆయన కోర్టును ఆశ్రయించారు. తనకు మద్యం అలవాటు లేకపోయినా బ్రీత్ అనలైజర్? పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని ఉద్యోగం నుంచి తీసేశారని పిటిషన్ దాఖలు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేసును విచారించిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బ్రీత్ అనలైజర్ పరీక్షలు కేవలం ప్రాథమిక ఆధారమేనని స్పష్టం చేశారు. వీటి ఆధారంగానే ఉద్యోగం నుంచి తీసేంత చర్యలు సరికాదని పేర్కొన్నారు. రక్త, మూత్ర నమూన పరీక్షలు చేసిన తర్వాత నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీసీ డిపో మేనేజర్ తీసుకున్న చర్యలు చట్టవిరుద్ధమని తెలిపారు. అంతే కాకుండా ధర్నాలో చాలా మంది పాల్గొన్నప్పటికీ కేవలం ఒక వ్యక్తిపై తీసుకున్న చర్యలు కక్షపూరితంగా ఉన్నట్టు కనిపిస్తోందని కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. అందుకే డిపో మేనేజర్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది కోర్టు. తిరిగి డ్రైవర్‌ను ఉద్యోగంలో తీసుకోవాలని ఆదేశించింది.

# ప్రపంచ పక్షవాత దినోత్సవం

## - వేలూరు నరువీ హాస్పిటల్ తరపున అవగాహన వాకథాన్




**చిత్తూరు, సూర్య వాస్తవం, నవంబర్ 2:** ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా పక్షవాతం గురించి అవగాహన కల్పించేందుకు వేలూరు నరువీ హాస్పిటల్ తరపున వాకథాన్ కార్యక్రమాన్ని హాస్పిటల్ చైర్మన్ డా. జి.వి.సంపత్ అధ్యక్షతన, వేలూరు నగర మేయర్ సుజాత ఆనందకుమార్ సమక్షంలో వేలూరు ఎమ్మెల్యే పి.కార్తికేయన్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో 500 మందికి పైగా పక్షవాతం గురించి అవగాహన కల్పించే బ్యానర్లు పట్టుకుని వాకథాన్‌లో పాల్గొన్నారు. ఈ వాకథాన్ కార్యక్రమంలో నరువీ హాస్పిటల్ చైర్మన్ డా. జి.వి. సంపత్ మాట్లాడుతూ ఈ రోజుల్లో అనారోగ్యానికి కారణమయ్యే జంక్ ఫుడ్, డ్రగ్స్, ఒత్తిడి వంటి అనేక కారణాల వల్ల పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా, ఈ కారణాల వల్ల నేటి యువత ఎక్కువగా పక్షవాతం బారిన పడుతోంది. అందుకే, పక్షవాతం రాకుండా నివారించడానికి మరియు దాని గురించి అవగాహన కల్పించడం చాలా అవసరం. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా నరువీ హాస్పిటల్ ఒక అవగాహన వాకథాన్‌ను నిర్వహించింది. అందుకే, ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే మార్గాలను విడిచిపెట్టాలి. వేలూరు కోట మైదానం నుండి ప్రారంభమైన ఈ పక్షవాతం అవగాహన వాకథాన్‌లో నరువీ హాస్పిటల్ వైస్ చైర్మన్ అనితా సంపత్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరవణన్ రామన్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ చిత్తంబలం మరియు వివిధ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, నరువీ హాస్పిటల్ వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పక్షవాతం వ్యాధి గురించి అవగాహన కల్పించే నినాదాలు 'ప్రతి నిమిషం ముఖ్యం', 'పక్షవాతం లక్షణాలను వెంటనే గుర్తించి ప్రాణాలను కాపాడండి', 'జాగ్రత్తగా ఉంటే సెకన్లలో ప్రాణాలను కాపాడవచ్చు', 'సకాలంలో చికిత్స పొందితే నయం చేయవచ్చు' వంటి అనేక నినాదాలు ఉన్న బ్యానర్‌లను పట్టుకున్నారు. వేలూరు కోట గాంధీ విగ్రహం నుండి ప్రారంభమైన ఈ వాకథాన్, పాత బస్టాండ్ రోడ్డు గుండా నరువీ హాస్పిటల్ వద్ద ముగిసింది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854